క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు సీనియర్ నేత రాజీనామా

కొత్తూరు: బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన టీఆర్‌టీయూ మాజీ మండల అధ్యక్షుడు తుప్పర రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమం నుంచి పార్టీలో కొనసాగుతున్న తనకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం, ఇటీవల పార్టీ విధానాలు నచ్చకపోవడంతో తాను రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

ఫార్మసీ విభాగంలో డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: మండలంలోని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న లలితా రేపుడి డాక్టరేట్ పట్టా పొందారు. ఆమె రాజస్థాన్ కోటాలోని కెరీర్ పాయింట్ యూనివర్సిటీలో ఫార్మసీ విభాగంలో ప్రొఫెసర్ ఎం.లక్ష్మి సురేఖ పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా లలితా రేపుడికి డాక్టరేట్ లభించింది. అధ్యాపకులు ఆమెను అభినందించారు.

కాంట్రాక్టర్లను మోసగించిన బీఆర్‌ఎస్

కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

షాద్‌నగర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేయించి కాంట్రాక్టర్లకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. షాద్‌నగర్‌లో ప్రభుత్వ ఆస్పత్రి అప్ గ్రేడ్ చేస్తామని గత ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆస్పత్రిని పరిశీలించి నిలిచిపోయిన పనులను తిరిగి ప్రారంభించారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తుందన్నారు.

విరివిగా మొక్కలు నాటండి



మొక్కలు నాటుతున్న ప్రధానోపాధ్యాయురాలు, పంచాయతీ కార్యదర్శి, ఉపాధ్యాయులు

శంకర్‌పల్లి: ఖాళీ స్థలాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి, సంరక్షించాలని కొండకల్ జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవనజ్యోతి కోరారు. వన మహోత్సవంలో భాగంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి సుమారు 200 మొక్కలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వాతావరణంలో పెనుమార్పులు వచ్చి సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సంవత్సరం కనీసం ఒక మొక్కని నాటి, సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య, ఉపాధ్యాయులు రఘునందన్‌రెడ్డి, కృష్ణయ్య, అంజిరెడ్డి, శ్రీను, కుసుమకుమారి, ఇందిరా బాయి, రాధ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల అందజేత

చేవెళ్ల: మండలంలోని రామన్నగూడ గ్రామానికి చెందిన జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్దళ్ల పర్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు దయాకర్ వృద్ధులకు శుక్రవారం బట్టలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. తన తండ్రి జ్ఞాపకార్థం ఏటా పేదలకు సహాయ కార్యక్రమాలు చేస్తున్న అన్నారు. గ్రామంలో ఉన్న దాదాపు 100 మంది పెన్షన్‌దారులకు కొత్త బట్టలు అందజేశానన్నారు. కార్యక్రమంలో దయాకర్ కుటుంబసభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

దేవాలయ పాలక మండలి నియామకం

కొందుర్గు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ పాలక మండలిని నియమిస్తూ ఎండోమెంట్ అధికారులు ఉత్తర్వులు శుక్రవారం జారీచేశారు. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యులుగా సి.కృష్ణయ్య, శీలం వేణుగోపాల్, బొజ్జిగారి అనిత, తుప్పగూడెం మాధవరెడ్డి, బోయ చిన్న నర్సింలు, జగ్గమొళ్ల బాల్‌రాజ్, చిప్ప అమరలింగంలను నియమించారు. అదేవిధంగా దేవాలయ అర్చకులు జంగం రాజేశ్‌ను ఎక్స్ అఫిషియో మెంబర్‌గా నియమించారు. నూతన పాలక మండలి త్వరలోనే ప్రమాణ స్వీకారం చేయించి దేవాలయ చైర్మన్ నియామకం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉపకేంద్రాలకు భవనాలు కరువు

- సౌకర్యాల లేమితో రోగుల ఇక్కట్లు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న సిబ్బంది, వైద్యులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

కొత్తూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అత్యవసర సమయాల్లో సత్వర వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గతంలో ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేసింది. కాలక్రమేణ కొన్ని గ్రామాల్లో కొనసాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రాలు పల్లె దవాఖానాలుగా మారాయి. మరికొన్ని చోట్ల ఆరోగ్య ఉపకేంద్రాల్లోనే సేవలు అందిస్తున్నారు. కాగా ప్రజలకు వైద్యం అందించడానికి ప్రభుత్వాలు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఆరోగ్య ఉపకేంద్రాలు, పల్లె దవాఖానాలకు మాత్రం సొంత భవనాలు కరువయ్యాయి. దీంతో తాత్కాలిక భవనాల్లో సేవలు కొనసాగిస్తున్నా మౌలిక వసతులు లేకపోవడంతో బాలింతలు, గర్భిణులు, రోగులు ఇబ్బందిపడుతున్నారు. అయినా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



కొత్తూరు పీహెచ్‌సీ

ఆరోగ్య ఉపకేంద్రాలు ఇలా..

కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలో సుమారు 22 వేల జనాభా ఉన్నారు. మున్సిపాలిటీలో ప్రత్యేకంగా ప్రభుత్వ ఆస్పత్రి ఉండాల్సి ఉండగా ఇప్పటికీ ఏర్పాటు కాలేదు. మండలంలో 5 పల్లె దవాఖానాలు(ఎస్‌బీపల్లి, గూడూరు, తిమ్మాపూర్, ఇన్ముల్‌నర్వ, నర్సప్పగూడ) రెండు చోట్ల ఆరోగ్య ఉపకేంద్రాలు కొనసాగుతున్నాయి. కాగా గూడూరు, ఎస్‌బీపల్లిలో మాత్రమే పల్లె దవాఖానాలకు సొంత భవనాలు నిర్మించారు. మిగిలిన దవాఖానాలు, కేంద్రాలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. ప్రతి రోజు ఆరోగ్య ఉపకేంద్రాలకు సుమారు 200 మంది రోగులు వస్తున్నట్లు వైద్యుల రికార్డులు తెలుపుతున్నాయి.

కుర్చీలు సైతం లేవు

కొత్తూరు మున్సిపాలిటీ, మండలంలో కొనసాగుతున్న ఆరోగ్య ఉపకేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేక రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో రోగులు కూర్చోడానికి వీలుగా కుర్చీలు అందుబాటులో లేవు. మరికొన్ని కేంద్రాల్లో మరుగుదొడ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలు లేవు. దీంతో ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహించే సిబ్బంది, ఆయా వైద్య పరీక్షల కోసం కేంద్రాలకు వస్తున్న రోగులు సౌకర్యాల లేమితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సౌకర్యాలు లేక ఇబ్బంది



"కొత్తూరు మున్సిపాలిటీతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న పల్లె దవాఖానా, ఆరోగ్య ఉపకేంద్రాలకు సొంత భవనాలు లేవు. కేవలం ఎస్‌బీపల్లి, గూడూరులో మాత్రమే పల్లె దవాఖానాలకు సొంత భవనాలు నిర్మించారు. సాధ్యమైనంత త్వరలో వీటిలో సేవలను ప్రారంభిస్తాం. ఆరోగ్య ఉపకేంద్రాలకు వచ్చే రోగులకు ఏఎన్‌ఎంలు ప్రథమ చికిత్సలు అందించి మెరుగైన వైద్యం కోసం పీహెచ్‌సీకు తరలిస్తున్నారు."

– హరికిషన్, పీహెచ్‌సీ వైద్యుడు, కొత్తూరు

సీఎంఆర్‌ఎఫ్ నిరు పేదలకు వరం



చేవెళ్ల: చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, చిత్రంలో నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు సంబంధించి 96 మందికి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను స్థానిక నాయకులతో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నియోజకవర్గంలోని పేదలకు వైద్య సహాయానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను విడతల వారీగా పంపిణీ చేస్తామన్నారు. పేద ప్రజల కోసం నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు వసంతం, కృష్ణారెడ్డి, రాములు, శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మానిక్యరెడ్డి, నరేందర్, శ్రీనివాస్, గోపాల్, నరేందర్, కుమార్, పెంటయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామానికి బీటీ రోడ్డు వేయించండి



షాబాద్: ఎమ్మెల్యే యాదయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎర్రోనిగూడ గ్రామస్తులు

షాబాద్: ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని మండలంలోని ఎర్రోనిగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. కంకర తేలి, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడిన రోడ్డుపై మేము ఎలా ప్రయాణించాలని ప్రశ్నించారు. మల్లారెడ్డిగూడ స్టేజి నుంచి ఎర్రోనిగూడ గ్రామ వరకు మూడు కిలో మీటర్ల మేరకు మట్టిరోడ్డు పూర్తిగా దెబ్బతిందని, మా గ్రామానికి బీటీ రోడ్డు వేయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

శంకర్‌పల్లి చైర్‌పర్సన్ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీలోని 11వ వార్డులో ఫ్రైడే–డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం కాలనీల్లో ఇళ్ల మధ్య చేరిన మురుగునీరుని పరిశీలించిన ఆమె.. త్వరగా శుభ్రం చేయాలని సూచించారు. వర్షానికి రోడ్ల వెంట నిలిచిన నీరు, చెత్తను తొలగింపజేసి కార్మికులతో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా ప్రబలే అవకాశం అధికంగా ఉండడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ శ్రీనాథ్, పర్యావరణాధికారి ఆనంద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాలు

పట్టణంలో బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీణ్‌కుమార్ దంపతులు, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి, చిత్రంలో కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్

విగ్రహావిష్కరణకు తరలిరండి

మాడ్గుల: కల్వకుర్తి సమీపంలోని కొట్రగేటు చౌరస్తాలో 28న కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కిషన్ రెడ్డి కోరారు. మాడ్గులలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని కొట్రగేటు వద్ద ఏర్పాటు చేసిన ఉత్తమ పార్లమెంట్ అవార్డు గ్రహీత, కేంద్రమాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్ రెడ్డి విగ్రహాన్ని ఆదివారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారన్నారు. అనంతరం నిర్వహించే బహిరంగ సభకు మాడ్గుల మండల గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు, జైపాల్ రెడ్డి అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఆమనగల్లు: ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం జాతీయ రహదారిపై రాజీవ్‌చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 7వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. వెంటనే మెగా డీఎస్సీని ప్రకటించాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు గోరటి భరత్, లండం మల్లేశ్, అంజి, మల్లేశ్, విజయ్, సిద్ధు, ప్రసాద్, శాగూర్, చరణ్, రాకేశ్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా ఉండాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: పట్టణంలో వై జంక్షన్ కూడలి నుంచి రైల్వే వంతెన వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఇందులో భాగంగా శుక్రవారం ఆయన నాయకులతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. రోడ్డు వెడల్పు పనులకు వ్యాపారులు, స్థానికులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, శ్రీను, నవీన్‌చారి, నర్సింహ, గోవింద్‌నాయక్, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ జిల్లా చైర్మన్‌గా శ్రీను నాయక్



షాద్‌నగర్: శ్రీనునాయక్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ జిల్లా చైర్మన్‌గా షాద్‌నగర్‌కు చెందిన శ్రీనునాయక్‌ను నియమించారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం శ్రీనునాయక్‌ను ఘనంగా సన్మానించారు.

గాయపడిన జింకను రక్షించిన రైతు

- ఫారెస్ట్ అధికారులకు అప్పగింత
- మిర్జాగూడ శివారులో ఘటన

చేవెళ్ల: దారి తప్పిన ఓ జింక గ్రామంలోని రైతుల పొలాల వద్దకు వచ్చింది. ఒంటరిగా కనిపించిన జింకను వీధి కుక్కలు వెంటాడటంతో గాయపడి ఓ పొలంలోని పశువుల పాకకు చేరుకుంది. ఇది గమనించిన రైతు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో వారొచ్చి అటవీ అధికారులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని మీర్జాగూడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు ఆవుల జంగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పొలంలో పనులు చేస్తుండగా ఓ జింక కుక్కల దాడి నుంచి తప్పించుకొని పొలం వద్దకు వచ్చింది. పొలంలోని పశువుల పాకలో ఉండటంతో గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. వికారాబాద్ అటవీ ప్రాంతం నుంచి ఈ జింక దారి తప్పి ఇటుగా వచ్చినట్లు పోలీసులు, స్థానికులు భావిస్తున్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించటంతో గాయపడిన జింకకు చికిత్స చేసి అనంతరం వారి వెంట తీసుకెళ్లారు. జింక వచ్చిందని తెలియడంతో చుట్టుపక్కల రైతులు, ప్రజలు భారీ సంఖ్యలో చేరుకున్నారు. జింకను కాపాడి అధికారులకు అప్పగించిన రైతు జంగయ్యను అభినందించారు.



పశువుల పాకలో సేద తీరుతున్న జింక

ప్రభుత్వ స్థలాన్ని శ్మశాన వాటికకు ఇవ్వొద్దు

కొడిచర్ల తండావాసుల డిమాండ్

కొత్తూరు: మండల పరిధిలోని కొడిచర్లతండాలో సర్వే నంబర్ 198లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని క్రిస్టియన్ శ్మశాన వాటికకు ఇవ్వొద్దని తండావాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి శుక్రవారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం తండావాసులు మాట్లాడుతూ.. తాండలో ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు నిర్మించడానికే స్థలాలు లేవన్నారు. ప్రస్తుతం తండా సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలం 2 ఎకరాల 10 గుంటలను క్రిస్టియన్ శ్మశాన వాటికకు కేటాయించేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, జంగయ్య, సంతోష్‌నాయక్, బిచ్చ, మోహన్, దేవు, కుమార్, రాము, గోపాల్, బాల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తండావాసులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

ఇబ్రహీంపట్నం: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి జంగయ్య పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలంగా ఉన్న అన్ని గ్రామాల్లో సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేయాలన్నారు. ఇకపై స్థానిక సంస్థలపై దృష్టి పెట్టి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉంటుందా లేదా అనే అంశంపై పార్టీ ఆధిష్టానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో పార్టీ నిర్మాణానికి ప్రతీ కార్యకర్త, నాయకుడు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నర్సింహ్మా, యాదిరెడ్డి, లక్ష్మయ్య, శివయ్య, కృష్ణ, జిల్లా గిరిజన సంఘం అధ్యక్షుడు రాజునాయక్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

మూడు మండలాల పార్టీ బాధ్యుల నియామకం

ఈ సమావేశంలో మూడు మండలాల సీపీఐ బాధ్యులను నియమించారు. ఇబ్రహీంపట్నం మండల సీపీఐ కార్యదర్శిగా ములుగు నర్సింహ్మా, మంచాల మండల కార్యదర్శిగా రాజునాయక్, సహాయ కార్యదర్శులుగా మేకల రామకృష్ణ, గాలయ్యలను, యాచారం మండల పార్టీ కన్వీనర్‌గా నీలం శివయ్య, కో కన్వీనర్‌గా మస్కు సంజీవను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య తెలిపారు.

నెత్తిన బోనం.. గ్రామాల్లో ఘనం



పర్వతాపూర్‌లో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొందుర్గు: మండలంలోని పర్వతాపూర్, ఉమ్మెంత్యాల, లాలపేట, తంగెళ్లపల్లి, ఆగిర్యాల, పాత ఆగిర్యాల, చిన్న ఎల్కిచర్ల, పులుసుమామిడి తదితర గ్రామాల్లో శుక్రవారం బోనాల ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి, వేప కొమ్మలతో అలంకరించిన బోనాలను తలపై పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుల మధ్య పోతురాజుల విన్యాసాలతో అంగరంగా వైభవంగా ఉత్సవం సాగింది.



జిల్లేడ్ చౌదరిగూడ రావిర్యాలలో బోనాలతో మహిళల గ్రామోత్సవం

ట్రాన్స్‌కో ఉద్యోగి సస్పెండ్

షాద్‌నగర్: షాద్‌నగర్ ట్రాన్స్‌కో శాఖలో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రభాకర్‌ను శుక్రవారం సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. షాద్‌నగర్ రూరల్ ట్రాన్స్‌కో పరిధిలో వెలిజర్లలో ఆర్టిజన్‌గా పని చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తత ముఖ్యం

పహాడీషరీఫ్: వర్షాకాలంలో ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ అల్లూరి వాణిరెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీ, వాదే ముస్తఫా బస్తీలలో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను 18వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీనారాయణ, 21వ వార్డు కౌన్సిలర్ ఫమిదా అఫ్జల్‌లు ఆమెకు వివరించారు. ముఖ్యంగా డెంగీ వ్యాధి ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణ కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహించడంతో పాటు చెత్త పడేసే పాయింట్ల వద్ద బ్లీచింగ్ పౌడర్‌ను కూడా చల్లుతున్నామన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. ప్రజలంతా తమ ఇళ్లల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకరోజు నీటిని పూర్తిగా పారబోసి, కొత్తగా పట్టుకోవాలన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకునేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలు లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. పాడైన రోడ్లకు కూడా మరమ్మతులు చేపడుతామని తెలిపారు.